కేసుల పరిష్కారం.. సులభతరం

- ఈ మాల్‌ఖానా సిస్టంతో ఎంతో లాభం
- కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు
- సరికొత్త విధానంతో సత్ఫలితాలు

మర్రిపాలెం: నగర పోలీస్ కమిషనర్ సీఎం త్రివిక్రమ్ వర్మ పోలీస్ స్టేషన్లలో కొత్త విధానాలకు శ్రీకారం చుట్టారు. అధికారులు, సిబ్బంది పనితీరును గుర్తించడం కోసం ప్రతి స్టేషన్‌ను సందర్శించి, తగు సూచనలిస్తూ కేసుల సత్వర పరిష్కారానికి ఆదేశాలు జారీ చేస్తున్నారు. అందులో భాగంగానే కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో 'ఈ మాల్‌ఖానా సిస్టం' ఏర్పాటు చేశారు. ఇదివరకు కేసుల ఫైళ్లు ఎక్కడో పెట్టడంతో ఫైల్ ప్రాపర్టీ.. కేసు సమయానికి దొరికేది కాదు. ఈ మాల్‌ఖానా పద్ధతి వచ్చాక బార్‌కోడ్ స్కానర్ విధానంతో కేసు సమయానికి ప్రాపర్టీని అందించడంలో ఎంతో ఉపయోగంగా ఉంది. గతంలో ఓ కేసుకు సంబంధించిన వివరాలు, అస్తులు తెలియాలంటే ఫైల్ భద్రపరిచిన అధికారి లేదా సిబ్బంది ఉంటేనే తెలిసేది. పాత కేసు అయితే కష్టమే. పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుదారులు వచ్చినపుడు సంబంధిత ఫైళ్లు ఎక్కడుందో వెతుక్కోవడం అధికారులు, సిబ్బందికి తలనొప్పిగా పరిణమించేవి. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారింది. ఇప్పటి వరకు ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అమలవుతున్న ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు తోడుగా ఈ మాల్‌ఖనా సిస్టం ఏర్పాటు చేయడంతో సత్ఫలితాలు సాధిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఫలితంగా ఫిర్యాదుదారుల కేసుల వివరాలను పోలీసులు సకాలంలో పొందడానికి ఆస్కారం ఏర్పడింది.

బార్‌కోడ్ స్కానర్‌తో ఫైళ్లు ప్రత్యక్షం

సాధారణంగా పోలీసులు, పోలీసు ఉన్నతాధికారులకు బదిలీలు అవుతుంటాయి. ఈ నేపథ్యంలో సదరు


కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్

ముద్దాయిని కోర్టుకు హాజరు పరిచినప్పుడు సంబంధిత ఫైల్‌ను, వారు వాడిన ఆయుధాలు, తదితర సామగ్రిని కోర్టులో ప్రవేశ పెట్టాల్సి ఉంది. ఈ లోపు అధికారులకు బదిలీలు జరిగితే.. అప్పుడు ఆ ఫైల్‌ను కనుక్కోవడం ఇబ్బందికరంగా ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేదు. పోలీస్ బాస్ త్రివిక్రమ్ వర్మ వచ్చాక ఈ పద్ధతిని సులభతరం చేసేందుకు ఈ మాల్‌ఖానా సిస్టంను ప్రవేశ పెట్టడం విశేషం. దీని ద్వారా ఏ కేసు ఎప్పుడు జరిగిందో, వాటికి సంబంధించిన వివరాలను ఎక్కడ భద్రపరిచారో బార్‌కోడ్ స్కానర్ ద్వారా ఎంత పాత కేసు ఫైల్ అయినా ఇట్టే తెలుసుకోవచ్చు.

విభాగాల వారీగా.. భద్రంగా..

కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లోని శాంతిభద్రతలు, నేర, ట్రాఫిక్ విభాగాలకు నిత్యం అధిక సంఖ్యలో ఫిర్యాదుదారులు వస్తుంటారు. స్టేషన్ పైఅంతస్తులోని గదిలో ఈ మాల్‌ఖానా సిస్టం ఏర్పాటు చేశారు. ఇక్కడ విభాగాల వారీగా పెండింగ్ కేసుల ఫైళ్లు, ముద్దాయిలు వాడిన ఆయుధాలను భద్రపరిచారు. దీంతో పోలీసు ఉన్నతాధికారులు సిబ్బంది ద్వారా సంబంధిత కేసు ఫైళ్లను కోర్టుకు చిటికెలో అందజేయగలుగుతున్నారు. ఫలితంగా వెనువెంటనే సదరు కేసుల్లో ఒక నిర్ణయం తీసుకోవడానికి మార్గం సుగమమైంది.


ఈ మాల్‌ఖానా సిస్టం వద్ద ఎస్‌ఐలు రవికిషోర్, దివ్యభారతి, ఏఎస్‌ఐ సతీష్

తద్వారా సీఐలు, ఎస్‌ఐలు బదిలీ అయి కొత్తవారు వచ్చినా సరే కేసు ఫైలు సత్వరమే టేబుల్‌పైకి వస్తున్న కారణంగా ఇరు వర్గాలకు పోలీసులు వెంటనే కౌన్సెలింగ్ చేయగలుగుతున్నారని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేసు పోయే అవకాశమే లేదు



నగర పోలీస్ కమిషనర్‌గా త్రివిక్రమ్ వర్మ వచ్చాక ఈ మాల్‌ఖానాను ప్రవేశపెట్టారు. దీంతో కోర్టులో అందించాల్సిన దస్త్రాలు, ఆయుధాలను ఇబ్బంది లేకుండా బార్‌కోడ్‌కు స్కానర్ ద్వారా స్కాన్ చేస్తే కేసు వివరాలు మొత్తం వచ్చేస్తాయి. ఈ సిస్టం ద్వారా కేసు వివరాలు మిస్ అయ్యే ఆస్కారం లేదు. వివధ కేసుల్లో పట్టుబడ్డ ఏ వస్తువైనా సిస్టం ద్వారా కేసు వివరాలు తెలుసుకోవచ్చు.

– ఎస్.విజయ్‌కుమార్, సీఐ, కంచరపాలెం

పలు రైళ్ల రీ షెడ్యూల్.. దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ఆయా స్టేషన్లలో శుక్రవారం పలు రైళ్లు ఆలస్యంగా బయలుదేరాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. చెన్నై సెంట్రల్‌లో రాత్రి 7.20 గంటలకు బయలుదేరాల్సిన చెన్నై సెంట్రల్–హౌరా(12840) మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు రెండు గంటలు ఆలస్యంగా రాత్రి 9.30 గంటలకు బయలుదేరింది. హౌరాలో రాత్రి 11.55 గంటలకు బయలుదేరాల్సిన హౌరా–ఎంజీఆర్ చెన్నై సెంట్రల్(12839) మెయిల్ ఎక్స్‌ప్రెస్ సుమారు నాలుగు గంటలు ఆలస్యంగా శనివారం తెల్లవారుజాము 4 గంటలకు బయలుదేరింది. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లో సంభవించిన అగ్ని ప్రమాదం దృష్ట్యా శుక్రవారం విశాఖలో బయలుదేరిన విశాఖపట్నం–లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్‌లో బయలుదేరిన సికింద్రాబాద్–హౌరా(12703) ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్‌లను దారి మళ్లించారు. ఈ రైళ్లు విజయవాడ, కాజీపేటల మీదుగా నడిచాయి.

క్లుప్తంగా

స్కీం ఇళ్ల నిర్మాణానికి చర్యలు


రెల్లి వీధిలో పరిశీలిస్తున్న ఈఈ ప్రసంగరాజు, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు బీటీఆర్ నగర్ రెల్లి వీధిలో 1999లో మంజూరైన స్కీం ఇళ్లు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో పది మంది లబ్ధిదారులు రోడ్డు పక్కన రేకుల గుడిసెల్లో నివసిస్తున్నారు. వారి ఇబ్బందులను గమనించిన జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ సమస్యను హౌసింగ్ విభాగం అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈమేరకు శుక్రవారం రెల్లివీధిలో హౌసింగ్ ఈఈ ఆర్.ప్రసంగరాజు, ఏఈ ప్రభ, కార్పొరేటర్ గోవింద్ పర్యటించారు. ఆగిపోయిన ఇళ్లు పూర్తి చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ రాజశేఖర్, ఎమినిటీ సెక్రటరీ అనూష, స్థానికులు బొమ్మాలి రవి, జగన్, వలంటీర్లు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: అనుకోని స్థితిలో ఒక వ్యక్తికి గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మస్తాన్ షరీఫ్ అనే వ్యక్తి గురువారం రాత్రి జాతీయ రహదారి మీదుగా మాధవధార వుడా కాలనీలోని తన ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ క్రమంలో ఊర్వశి కూడలి వద్ద స్పృహ కోల్పోయి పడిపోయాడు. ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందా.. లేక తనంతట తానే పడిపోయాడా అన్నది తెలియలేదు. ప్రస్తుతం అతడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుడి పరిస్థితి విషమంగా ఉండటంతో శుక్రవారం రాత్రి మస్తాన్ షరీఫ్ కుమారుడు మహమ్మద్ కరీముద్దీన్ ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి


కీర్తనలు ఆలపిస్తున్న గాయని విష్ణుప్రియ

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి అలరించింది. మండా సుధారాణి శిష్యురాలు ఎస్.విష్ణుప్రియ తన అద్భుత గానంతో ప్రేక్షకులకు వీనుల విందు చేశారు. అమ్మా ఆనంద దాయిని, మహా గణపతిం, రాజ రాజ రాజితే, మారివేరే గతి, ఆనందామృతాకర్షిణి, స్వర రాగ సుధ కీర్తనలు ఆకట్టుకున్నాయి. ఈమెకు వి.గాయత్రి విభావరి వయోలిన్‌పై, సాయి కేశవ్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఆగస్టు 6న శ్రావణలక్ష్మి పోటీలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకురాలు ఉషారాణి తదితరులు

సీతంపేట: శ్రావణ మాసం సందర్భంగా శ్రావణ శోభ ఉట్టిపడేలా క్వీన్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో శ్రావణ లక్ష్మి పోటీలు నిర్వహిస్తున్నట్టు సంస్థ నిర్వాహకురాలు మొదలవలస ఉషారాణి తెలిపారు. విశాఖ పౌరగ్రంథాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిర్వహించారు. మిసెస్ వైజాగ్ 2018, 2021 విజేతలు డాక్టర్ సంగీత గురువెల్లి, పి.సౌజన్య, మిసెస్ ఆంధ్రా 2021 విజేత రజని పైడి, పూర్వి కలెక్షన్స్ అధినేత రమతో కలిసి ఈవెంట్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ హిందూ సంప్రదాయం, సంస్కృతీ ప్రతిబింబించేలా మిస్ శ్రావణలక్ష్మి, మిసెస్ శ్రావణ లక్ష్మి టైటిల్ పోటీలు ఆగస్టు 6న సీఎంఆర్ ఫంక్షన్‌హాల్లో నిర్వహిస్తామని తెలిపారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

సీతంపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 28వ వార్డు బోరావారి వీధి ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ స్కూల్‌కు వెళ్లే పిల్లల నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకు అందరికీ మేలు జరిగేలా నవరత్నాల పథకాల ద్వారా సీఎం వైఎస్ జగన్ మంచి చేస్తున్నారన్నారు. ఆయనలోని ప్రజలకు సేవ చేయాలనే తపన, నిజాయితీ, నిబద్ధత, పట్టుదల, కష్టపడి పనిచేసే తత్వాన్ని మనందరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ బులుసు జగదీష్, పార్టీ నాయకులు పైడి రమణ, పాండవ శ్రీను, నూకరాజు, రాయుడు శ్రీను, బొడ్డేటి కిరణ్, అమ్మాజి, నవాబ్, శ్యామల, హరి, శేషు, బాబ్‌జాన్ తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

వైఎస్సార్ జయంతి వేళ.. విద్యార్థులకు పోటీలు

మర్రిపాలెం: దివంగత ముఖ్య మంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ముందస్తు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య వ్యవస్థాపకుడు సనపల నారాయణ స్వామి ఆధ్వర్యంలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథి ఆంధ్రా యూనివర్సిటీ ఆచార్యుడు పి.అర్జున్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు వైఎస్సార్ చేసిన సేవలను గుర్తు చేశారు. అనంతరం విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, బీవీపీ జాతీయ స్థాయి ప్రతినిధి ఆర్.సి.జైన్, సంస్థ ప్రతినిధులు ఎస్.నారాయణస్వామి, ఎస్.రవీంద్రకుమార్, పాతపట్నం రామ్మోహన్, ఎస్.రవికుమార్ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న సింహాద్రి అప్పన్న ప్రచార సమైక్య సభ్యులు

30న సంగీత కళాకారుల సంఘం ఎన్నికలు


మాట్లాడుతున్న ఎన్నికల కన్వీనర్ చెన్నా తిరుమలరావు


హాజరైన కళాకారులు, గాయకులు

సీతంపేట: సంగీత సంస్థలు, గాయకులతో నెలకొల్పిన విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘానికి ఈ నెల 30న సీక్రెట్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ కన్వీనర్ చెన్నా తిరుమలరావు తెలిపారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం జరిగిన కళాకారుల సర్వసభ్య సమావేశంలో ఎన్నికల తేదీలను ఖరారు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు కళా సంఘాలు, కళాకారులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని, వారి సమస్యల పరిష్కారం కోసం కొత్త పాలక వర్గం ఎన్నిక అవసరమైందన్నారు. ఈ నెల 23 లోపు సభ్యత్వ నమోదు చేసుకోవాలని చెప్పారు. 25న నామినేషన్ల స్వీకరణ, 30న ఎన్నికలు జరుగుతాయన్నారు. కళాకారులకు సేవ చేయాలన్న దృక్పథం గల వారు పోటీల్లో నిలవాలని కోరారు. వివరాలకు 81796 05267 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. అనంతరం 9 మంది సభ్యులతో ఏర్పాటు చేసుకున్న అడ్‌హక్ కమిటీలో ఎన్నికల కన్వీనర్‌గా చెన్నా తిరుమలరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో తాత్కాలిక కమిటీ సభ్యులు కొణతాల రాజు, మహమ్మద్ ఖాన్, భయ్యా శ్రీనివాస్, జె.ఎంఆర్ నెహ్రూ, ఫణి భూషణ్, డి.భూపతిరావు, కందర్ప రాధ, ఎం.త్రినాథ్‌రావు, గంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

వాల్తేరు రైల్వే డివిజన్‌లో భద్రత తనిఖీలు

తాటిచెట్లపాలెం: గోపాలపట్నం, సింహాచలం రైల్వేస్టేషన్ల పరిధిలో శుక్రవారం డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్‌కుమార్ సత్పతి భద్రత తనిఖీలు చేపట్టారు. డివిజన్ పరిధిలో ప్రతీ సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలించి.. పూర్తిస్థాయి తనిఖీలు చేపట్టనున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు. భద్రత ప్రమాణాలు, ప్రోటోకాల్స్‌పై సిబ్బందికి కౌన్సెలింగ్ ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. పశ్చిమ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు, సింహాచలం ఆటో యూనియన్ ప్రతినిధులు డీఆర్‌ఎంను కలిసి పలు సమస్యలను వివరించారు.


సింహాచలం రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌లు తనిఖీ చేస్తున్న డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి

ఉత్సాహంగా 'ఎకో–వైజాగ్' చిత్రలేఖన పోటీలు

కంచరపాలెం: 'ఎకో–వైజాగ్' పేరిట పాఠశాలల్లో శుక్రవారం జీవీఎంసీ చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. జోన్ పరిధిలోని ఆర్పీ పేట, కప్పరాడ జీవీఎంసీ హైస్కూళ్లు, కంచరపాలెం, ఆర్పీ పేట, కె.కాలనీ, తిక్కవానిపాలెం, ధర్మానగర్, రాంజీ ఎస్టేట్, సుభాష్‌నగర్ ప్రాథమిక పాఠశాలల్లో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నో యూజ్ సింగల్ ప్లాస్టిక్, పర్యావరణం తదతర అంశాలపై వారు గీసిన చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పోటీలను ఆర్పీ పేట హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసరావు, ఆర్ట్ ఇన్‌చార్జి ఎస్.ఎస్.శంకర్, సచివాలయం అడ్మిన్ అశోక్ పర్యవేక్షించారు.


ఆర్పీ పేట హైస్కూల్‌లో చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

పోయిన బ్యాగు అప్పగింత


కేరళ వాసికి బ్యాగు అప్పగిస్తున్న ద్వారకా జోన్ పోలీసులు

సీతమ్మధార: ఆటోలో మర్చిపోయిన విలువైన వస్తువులున్న బ్యాగును పోగొట్టుకున్న వ్యక్తికి ద్వారకా జోన్ పోలీసులు తిరిగి అప్పగించారు. ఫిర్యాదుదారుడు తెలిపిన వివరాలిలా.. కేరళకు చెందిన కాంట్రాక్ట్ ఇంజినీర్ మనూకుటన్ గురువారం సాయంత్రం కర్ణాటక నుంచి విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి నేరుగా ఆసంగం శరత్ థియేటర్ వద్ద గల డార్మెటరీకి వెళ్లాడు. శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంట తరువాత నేవల్ బేస్ వద్ద ఒక కంపెనీకి పనిమీద వెళ్లి తిరిగి డార్మెటరీకి చేరుకునే సమయంలో ఆటోలో బ్యాగు మర్చిపోయాడు. వెంటనే ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బ్యాగులో విలువైన ప్రెజర్ కాలిబ్రేటర్, ఆర్‌టీడీ కాలిబ్రేటర్, మల్టీ మీటర్ ఉన్నట్లు పేర్కొన్నాడు. వెంటనే పోలీసులు రంగంలోకి దిగి ఆటోను పట్టుకుని డ్రైవర్ నుంచి బ్యాగు స్వాధీన పర్చుకుని మనూకుటన్‌కు అప్పగించారు. తక్షణ చర్యలు చేపట్టిన ఏఎస్‌ఐ గంగాధర్‌రెడ్డిని అభినందించారు.

నైపుణ్యాభివృద్ధి కోర్సులు సద్వినియోగం చేసుకోండి


సెమ్స్ సీఈవో శేతుమాధవన్‌తో నోడల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరమణ


ల్యాబ్ యాక్టివిటీస్‌ను పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటరమణ తదితరులు

మురళీనగర్: ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధి కాలేజీల్లో నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కోర్సులను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని టెక్నికల్ ఎడ్యుకేషన్ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.వెంకటరమణ సూచించారు. విశాఖ పార్లమెంటరీ పరిధిలోని సెమ్స్‌లో ఏర్పాటు చేసిన నైపుణ్యాభివృద్ధి కాలేజీని(స్కిల్ కాలేజీ) జిల్లా టెక్నికల్ ప్రతినిధులు శుక్రవారం సందర్శించారు. ఈ మేరకు కాలేజీలో అమలు చేస్తున్న కోర్సులు, వాటి అమలు తీరును పరిశీలించారు. సెమ్స్ సీఈవో కె.శేతుమాధవన్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం, మార్కెటింగ్ మేనేజర్ లివింగ్‌స్టన్ ఫ్రాన్సిస్‌లతో స్కిల్ కోర్సులపై ఆయన చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ బీవీ లక్ష్మణరావు, ఎస్ఎల్‌పీ నిపుణుడు ఎస్‌వీఆర్ నాయుడు పాల్గొన్నారు.

రైలులో ప్రసవం

- నిండు గర్భిణికి పురుడు పోసిన 108 సిబ్బంది


విశాఖ రైల్వేస్టేషన్‌లో ఆడ శిశువుతో 108 సిబ్బంది

తాటిచెట్లపాలెం: ఆమె తొమ్మిది నెలల నిండు గర్భిణి. పేరు లక్ష్మి. ఒడిశా నుంచి హౌరా–యశ్వంత్‌పూర్ రైల్లో తన సొంతూరు రాజమహేంద్రవరానికి ప్రయాణిస్తోంది. ఈ రైలు శుక్రవారం ఉదయం 10.30 గంటల సమయంలో విశాఖపట్నం చేరుకుంది. అదే సమయంలో ఆమెకు పురిటి నొప్పులు రావడంతో 108కు సమాచారం అందించారు. క్షణాల్లో సమీపంలోని 108 అంబులెన్స్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. దాని వద్దకు ఆమెను తరలించే క్రమంలో నొప్పులు మరింత ఎక్కువ కావడంతో రైలు బోగీలోనే 108 సిబ్బంది పురుడు పోశారు. అనంతరం తల్లీబిడ్డలను కేజీహెచ్‌కు తదుపరి చికిత్స నిమిత్తం తరలించారు. ఈమె రెండో కాన్పులో పండంటి ఆడబిడ్డను ప్రసవించిందని, తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు 108 మెడికల్ టెక్నీషియన్ గంగాధర్, పైలట్ లింగరాజులు తెలిపారు. చాకచక్యంగా పురుడు పోసిన 108 సిబ్బందిని స్టేషన్‌లో ప్రయాణికులు, విశాఖపట్నం సిటీ కో ఆర్డినేటర్ సురేష్ అభినందించారు.

24వ వార్డులో ఆక్రమణల తొలగింపు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో పలు చోట్ల ఆక్రమణలను శుక్రవారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు తొలగించారు. డీసీపీ నరేంద్ర ఆధ్వర్యంలో ఏసీపీ శాస్త్రి సభవస్ నేతృత్వంలో టీపీవో తేజ పర్యవేక్షణలో ఈ చర్యలు చేపట్టారు. నక్కవానిపాలెం మెయిన్ రోడ్డు, ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఉన్న బడ్డీకొట్లు, టిఫిన్, తోపుడు బళ్లు, ఇతర సామగ్రిని పొక్లెయిన్‌తో తొలగించారు. రోడ్డుపైకి ఉన్న భవన నిర్మాణాలను కూల్చివేశారు. సెక్రటరీలు, చైన్‌మ్యాన్లు పాల్గొన్నారు.


నక్కవానిపాలెంలో ఆక్రమణలు తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు